www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -333 మంగళవారం 10 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## 25 రోజుల తర్వాతే గ్యాస్ బుకింగ్



**న్యూఢిల్లీ,,మార్చి9ప్రజావినికిడి:**
25 రోజుల తరువాతే గ్యాస్ రీ ఫిల్ బుకింగ్ చేసుకోవాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశంలో నెలకొన్న గ్యాస్ కొరతతో సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచుతున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకూ 21 రోజుల తరువాత రీఫిల్ బుక్ చేసుకోవచ్చుననే నిబంధన ఉంది. ఆ నిబంధనను కేంద్రం సవరించింది. రీ ఫిల్ బుకింగ్ గడువును 25 రోజులకు పొడిగించడం ద్వారా ప్రభుత్వం బుకింగ్‌లను నియంత్రిస్తోంది. పూర్తిస్థాయిలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతోన్న కేంద్రం మరోవైపు బుకింగ్ సమయాన్ని అమాంతం పెంచడం గృహ వినియోగదారులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 55 రోజులకోసారి బుక్ చేసుకునేవారు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజులకే బుక**మిగతా 2లో...**



# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

### పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి



హైదరాబాద్,,**మార్చి9ప్రజావినికిడి:**
ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు**మిగతా 2లో...**

# శాంతివైపే..

- చర్చలు, దౌత్యానికే ప్రాధాన్యత
- భారతీయుల భద్రతే ముఖ్యం
- పశ్చిమాసియాలో పరిణామాలపై పార్లమెంట్‌లో మంత్రి జై శంకర్ ప్రకటన




**న్యూఢిల్లీ, ,మార్చి9ప్రజావినికిడి:**
శాంతికే భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి వుంటుందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. చర్చా, దౌత్య వేదికలకు ప్రాధాన్యత నివ్వాలన్నది భారత్ అభిమతమని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలపై సోమవారం ఆయన పార్లమెంట్ ఉభయ సభల్లో ఒక ప్రకటన చేశారు **మిగతా 2లో....**

# కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'

- ఇరాన్ సుప్రీం నేతగా మొజ్తాబా ఖమేనీ
- నూతన సుప్రీం నేతకు పుతిన్ అభినందనలు
- మొజ్తాబాపై దాడులు చేస్తే వ్యతిరేకిస్తాం : చైనా
- నెతన్యాహుతో చర్చించాకే ముగింపుపై నిర్ణయం : ట్రంప్



**న్యూఢిల్లీ,,మార్చి9ప్రజావినికిడి:**
అయతొల్లా మొజ్తాబా ఖమేనీ ఇరాన్ నూతన సుప్రీం నేతగా నియమితుడైన తర్వాత ఇజ్రాయిల్ సోమవారం క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. టెహ్రాన్, ఇస్ఫహాన్, దక్షిణ**మిగతా 2లో...**



# కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- సీబీఐ కేసులో నిందితులను విముక్తి చేసిన రౌస్ అవెన్యూ కోర్టు
- కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన సీబీఐ
- రివిజన్ పిటిషన్ పై వివరణ ఇవ్వాలంటూ నిందితులకు హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మార్చి 9**
దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ మళ్లీ కీలక మలుపు తిరిగింది. ఫిబ్రవరి 27న రౌస్ అవెన్యూ కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందిని ఈ కేసు నుండి విముక్తి చేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. **మిగతా 2లో...**

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

### ధృవీకరణ పత్రాలు అందచేత



**హైదరాబాద్,,మార్చి9ప్రజావినికిడి:**
తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, **మిగతా 2లో...**

# 'ఫైళ్ల దహనం' తీవ్రమైన నేరం

- రికార్డ్ రూమ్‌లో మంటలెలా వచ్చాయి?
- మదనపల్లిలో ఫైళ్ల దహనం కేసులో నిందితులకు సుప్రీంకోర్టు షాక్
- దీని వెనుక ఉన్న ప్లాన్ ఏమిటి? పోలీసులు లోతుగా విచారించాలి
- మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి తదితరుల ముందస్తు బెయిల్‌కు నో
- పిటిషన్ కొట్టివేత.. హైకోర్టు ఆదేశాల్లో జోక్యానికి నిరాకరణ



**న్యూఢిల్లీ, ,మార్చి9ప్రజావినికిడి:**
మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనం కేసులో నిందితులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వారికి ముందస్తు బెయిల్‌ను కోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఎటువంటి బలమైన కారణాలు కనిపించడం లేదంటూ, నిందితుల పిటిషన్లను కొట్టివేసింది. ఫైళ్ల దహనం తీవ్రమైన నేరం అని **మిగతా 2లో...**

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,,మార్చి9ప్రజావినికిడి:**
అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు**మిగతా 2లో...**

# రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

- ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం ప్రయివేటు బిల్లు పెడతాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



2లో.



6లో.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# శాంతివైపే..

**మొదటిపేజీ తరువాయి**

తక్షణమే ఉద్రిక్తతల తగ్గింపు నకు చర్యలు తీసుకోవాలని, సంయమనం పాటించాలని కోరారు. పౌరుల భద్రతకు హామీ కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పశ్చిమాసియాలో పెచ్చరిల్లిన పరిస్థి తులు మనందరికీ తీవ్ర ఆందోళనను కలిగిస్తు న్నాయన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి చర్చలు జరపడమే అత్యంత సమర్థవంతమైన పరిష్కార మార్గమని, దీన్ని అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ ప్రాం తంలోని అన్ని దేశాల సార్వభౌమాధికారా న్ని, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించా ల్సిందేనని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల సంక్షేమం, భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. అక్కడి పరిణామాలను ప్రధాని మోడీ ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి నిరంతరంగా అక్కడి పరిస్థితులను మదింపు చేస్తున్నామన్నారు.

మోడీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశమై అక్కడి భారతీయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించిందన్నారు. ఇంధన భద్రతకు, చమురు, గ్యాస్ సరఫరాకు ఆ ప్రాంతం కీలకమైనది, గల్ఫ్ ప్రాంతానికి భారత్ ప్రధాన వాణిజ్య భాగస్వామి అని, ఏటా దాదాపు 200 బిలియన్ల డాలర్ల మేరకు వాణిజ్యం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ భద్రతకు ఎదురవుతున్న పర్యవసానాలపై, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలపై కమిటీ దృష్టి పెట్టిందని చెప్పారు. ఆ ప్రాంతంలోని అన్ని దేశాల అధిపతులతో భారత్ మాట్లాడిందన్నారు. ఆయా దేశాల్లో భారతీయుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటామని వారు కూడా హామీ ఇచ్చారన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించేందుకు, భారతీయుల అభ్యర్థనలపై స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. తాజాగా మార్చి 5న ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చితో మాట్లాడారనని, రాబోయే రోజుల్లో కూడా ఈ సంభాషణలు కొనసాగుతాయని చెప్పారు. ఇరాన్ నౌక ఐఆర్ఐఎస్ లావాన్‌కు కోచిలో ఆశ్రయం ఇచ్చామని, మానవతా ప్రాతిపదికనే ఈ అనుమతి ఇచ్చామని చెప్పారు."మనకు సంబంధించినంత వరకు భారతీయుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యత. ఈ సున్నితమైన పరిస్థితులు నెలకొన్న తరుణంలో మన ఇంధన సంస్థల ప్రయత్నాలకు అవసరమైన చోట భారత దౌత్యం మద్దతిస్తుంది." అని జైశంకర్ స్పష్టం చేశారు.

# కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్‌పై పెద్ద ఎత్తున దాడులు చేశామని ఇజ్రాయిల్ తెలిపింది. ఇస్ఫహాన్ గవర్నరేట్ భవనంపై జరిగిన దాడిలో ముగ్గురు గాయపడగా ఇద్దరు ఇప్పటికీ శిథిలాల కింద చిక్కుబడి ఉన్నారు. హెజ్బొల్లాతో సంబంధం ఉన్న సంస్థకు చెందిన శాఖలపై దాడులు చేస్తానని ముందుగానే హెచ్చరించిన ఇజ్రాయిల్‌డలెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై దాడి జరిపింది. ఇజ్రాయిల్ వైపు నుంచి జరుగుతున్న దాడులు ఉధృతం కావడంతో లెబనాన్ ప్రజలు అరిడా సరిహద్దును దాటి లిబియాకు చేరుకుంటున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ఇజ్రాయిల్ జరిపిన దాడులలో లెబనాన్‌లో 83 మంది చిన్నారులు చనిపోయారని యునిసెఫ్ వివరించింది. దక్షిణ లెబనాన్‌పై జరిగిన దాడిలో ఇద్దరు పారా మెడికల్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్ పరిస్థితిపై చర్చించేందుకు భద్రతా మండలిని అత్యవసరంగా సమావేశపరచాలని ఫ్రాన్స్ కోరింది. అటు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలలోని అమెరికా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని విస్తృతంగా దాడి చేస్తోంది. ఆదివారం రాత్రి బహ్రైన్‌లోని సిత్రా దీవిపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో 32 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని బహ్రైన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని నాటో రక్షణ వ్యవస్థలు తటస్థం చేశాయని టర్కీ చెప్పింది. భద్రతాపరమైన ముప్పు పెరిగే అవకాశం ఉన్నం దున ఆవాసాలను వదిలి బయటికి రావద్దని ఖతార్ తన ప్రజలకు సూచించింది. తమ నౌకాదళం కువైట్‌లోని అదిరి హెలికాప్టర్ స్థావరంపై డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులతో దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ ఒక ప్రకటన చేసింది. స్థావరంలోని ఇంధన, గ్యాస్ ట్యాంకు లను, అమెరికా హెలికాప్టర్ ర్యాంపులను, లాజిస్టిక్ సౌకర్యాలు ధ్వంసమయ్యాయని చెప్పింది. ఇదిలావుండగా దాడులు కొనసాగి నంత కాలం కాల్పుల విరమణ కోసం మధ్య వర్తిత్వ ప్రయ త్నాలు జరపడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖై స్పష్టం చేశారు. స్వీయ రక్షణకు ఇరాన్ ప్రయత్నాలు కొనసాగుతాయని చెప్పారు. తుర్కియే, అజర్‌బైజాన్, సైప్రస్‌పై తాము దాడులు జరుపుతున్నామంటూ వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఇరాన్ చమురు నిల్వలపై అమెరికా, ఇజ్రాయిల్ కన్నేశాయని, ఆ దేశాల దాడులు అంతర్జాతీయ చట్టాలను ప్రమాదంలో పడేస్తున్నాయని ఆరోపించారు.

### భగ్గుమన్న చమురు ధరలు

యుద్ధం కారణంగా సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్యారల్ ముడి చమురు ధర వంద డాలర్లు పెరిగింది. బ్రెంట్ ముడి చమురు (తేలికపాటి, తియ్యని చమురు) 2022 తర్వాత తొలిసారిగా 114 డాలర్లు దాటింది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో సౌదీ అరేబియా సంస్థ అరామ్కో రెండు చమురు క్షేత్రాలలో ఉత్పత్తిని నిలిపివేసింది. అనేక అరబ్ దేశాలు కూడా చమురు ఉత్పత్తిలో కోత విధిం చాయి. పెరుగుతున్న చమురు ధరలపై చర్చిం చేందుకు జీ7 దేశాలు అత్యవసర సమావేశాన్ని నిర్వహించాయి. బ్రిటన్ ఛాన్సలర్ రాచల్ రీవ్స్ సహా ప్రముఖ పారిశ్రామిక దేశాల ఆర్థిక మంత్రులు ఈ సమావేశానికి హాజర య్యారు. యుద్ధం కారణంగా కలిగే ఆర్థిక ప్రభా వంపై చర్చించారు. ఇంధన సరఫ రాలకు దీర్ఘ కాలం ఆటంకం ఏర్పడుతుందన్న భయాం దోళనల నేప థ్యంలో అంతర్జాతీయ చమురు ధర సుమారు 120 డాలర్లకు చేరింది.

### పరస్పర నిర్ణయం మేరకే యుద్ధం ముగింపు : ట్రంప్

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను సంప్ర దించి ఇరాన్ యుద్ధాన్ని ఎప్పుడు ముగించాలో నిర్ణయిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై జరుపుతున్న దాడుల విష యంలో బ్రిటన్ అను సరిస్తున్న వైఖరిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ టెలిఫోన్ సంభాషణ జరిపారు. మధ్య ప్రాచ్యానికి యుద్ధ విమాన వాహక నౌకలను పంపాలని అనుకుంటు న్నామని స్టార్మర్ చేసిన ప్రకటనపై ట్రంప్ స్పందిస్తూ ఇప్పటికే గెలిచిన యుద్ధా నికి వాటి అవసరం ఏముం దని ప్రశ్నించారు. మధ్యప్రాచ్యంలో కొన సాగుతున్న యుద్ధం కారణంగా లెబనాన్ పార్లమెంట్ పదవీకాలాన్ని రెండు సంవత్సరాల పాటు పొడిగించారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

**మొదటిపేజీ తరువాయి**

. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు.



అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు. రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే.

సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది.

మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చుని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

# రైతుల సొమ్ముతో 'రాహుల్ బంధు' పథకం

**ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం ప్రయివేటు బిల్లు పెడతాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్**

**రాజన్న సిరిసిల్ల,మార్చి9ప్రజావినికిడి:**
తెలంగాణ రైతులకివ్వాల్సిన సొమ్మును 'రాహుల్ బంధు' పేరుతో ఏడాదికి రూ.వెయ్యి కోట్లు తమ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రయివేటు మెంబర్ బిల్లును తీసుకొచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం మున్సిపల్ కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలు చట్టబద్ధత కోసం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ప్రయివేటు మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని, ఎందుకంటే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చెప్పిన మాటనే తాము అసెంబ్లీలో చెప్తామని అన్నారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి ప్రజలకు ఇచ్చిన



హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ 'రాహుల్ బంధు' పథకాన్ని రైతులకు ఇచ్చే రైతు బంధు నిధులతో మొదలుపెట్టారని, ఏడాదికి రూ.వెయ్యి కోట్లు రాహుల్ గాంధీకి ఇచ్చేలా పక్కాగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా రూ.వేల కోట్లు పంపించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతు బంధును ఎగ్గొట్టి.. ఈసారి కూడా ఎగనామం పెడుతున్నారని విమర్శించారు. ఇంకోవైపు సామంత రాజుగా వ్యవహరిస్తూ రాహుల్ గాంధీనికి కప్పం కట్టేందుకు పేదల భూములు లాక్కుని, వారి ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇండ్లను కూలగొట్టి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, జిల్లా పార్టీ ఇన్‌చార్జీ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, జిల్లానాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, చీటి నర్సింగరావు పాల్గొన్నారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు..

# ఈడీ దర్యాప్తు ముమ్మరం

రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది.

అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు చెందిన రూ. 441 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

# కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఈ క్రమంలో సీబీఐ పిటిషన్ పై ఈరోజు హైకోర్టు విచరాణ జరిపింది. ఈ విచారణలో భాగంగా ధర్మాసనం కేజ్రీవాల్, కవిత, సిసోడియాతో పాటు మిగిలిన నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సీబీఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... విచారణాధికారిపై కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, దర్యాప్తు సంస్థ, విచారణాధికారిపై ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, సీబీఐ కేసులో నిందితులు విడుదలయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసు విచారణను కూడా నిలిపివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా.. హైకోర్టు భిన్నంగా స్పందించింది. సీబీఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీ లాండరింగ్ కేసు విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**మొదటిపేజీ తరువాయి**

ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

**మొదటిపేజీ తరువాయి**

అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# 25 రోజుల తర్వాతే గ్యాస్ బుకింగ్

**మొదటిపేజీ తరువాయి**

చేస్తున్నారని, అందువల్లే గడువు పెంచుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.114.5 భారం వేసిన సంగతి తెలిసిందే. గ్యాస్ కొరత, ధరల పెంపు నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ వినియోగించే హోటళ్లు, రెస్టారెంట్లు ధరలను మరింత పెంచే అవకాశముందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

# 'ఫైళ్ల దహనం' తీవ్రమైన నేరం

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యానించింది. ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వంకిరెడ్డి మాధవరెడ్డి, ఇతరుల ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ, వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, రాష్ట్రప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. నిందితుడికి ఘటనతో సంబంధం లేదని, మంత్రి వద్ద పీఏగా పనిచేశారనే కారణంతోనే ఈ కేసులోకి లాగారని దామా శేషాద్రినాయుడు వాదించారు. ఆ ఘటన జరిగినప్పుడు అక్కడ ఆయన లేరని, అప్పటికి ఆరు నెలలుగా విదేశాల్లో ఉంటున్నారన్నారు.

ఆయనకు వ్యతిరేకంగా పోలీసుల వద్ద సరైన ఆధారాలు లేవని, కేవలం అనుమానంతోనే కేసు పెట్టారని పేర్కొన్నారు. నిందితుల తరఫు వాదనలు విన్న బెంచ్, ప్రభుత్వ కార్యాలయంలో ఫైళ్ల దహనం అత్యంత తీవ్రమైన నేరమని అభిప్రాయపడింది. "రికార్డ్ రూమ్‌లో మంటలు ఎలా అంటుకున్నాయి? దాని వెనుక ఉన్న ప్లాన్ ఏమిటి? అనే విషయాలను పోలీసులు లోతుగా విచారించాల్సి ఉంది" అని వ్యాఖ్యానించింది. నిందితుడు విదేశాల్లో ఉన్నారనే కారణంతో విచారణ నుంచి తప్పించుకోలేరని, ఇటువంటి కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. చట్టప్రకారం విచారణ కొనసాగాలని, ఇందుకు నిందితుడు సహకరించాలని స్పష్టం చేసింది.

# జాగృతి సొసైటీ అధ్యక్షురాలు సిసిఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎ.శివ పార్వతి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు





**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్ లో శివ పార్వతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి బిజెపి జిల్లా ఇంచార్జీ మల్లారెడ్డి,సిసిఐ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ఏవి రావు,లోక్సత్తా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్,పుప్పాల భాస్కర్,పెద్ద మల్లేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళా మణులకు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో జీవితంలో మహిళల ప్రాధాన్యత ఏ విధంగా ఉందో వివరించారు.ఒక తల్లిగా,భార్యగా చెల్లిగా,అక్కగా జీవితంలో ఎలాంటి బాధ్యతలను పోషించగలరు వివరించారు. మహిళలు అబలలు..కాదు సభలలు.. జననాలను గమనాలను శాసించగల ఒక నిశ్శబ్ద విప్లవమే మహిళ.. తరతరాల అంతరాల దొంతరలను తొలగిస్తూ అన్ని రంగాలలో పురుషులకు దీటుగా మహిళలు స్వశక్తితో ఎదుగుతూ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలుస్తుండడం ఎంతో గర్వకారణం అని గుర్తు చేశారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ బిక్షపతి, మక్కేన లక్ష్మమ్మ, జయశ్రీ, హీరాబాయి,ఉష, జ్యోతి,శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు..

### అవ్వ వ్యవస్థాపక అధ్యక్షురాలు చలసాని భారతి ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవం

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
నిజాంపేట్ సప్తపది గార్డెన్ లో ఆదర్శ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అవ్వ వ్యవస్థాపక అధ్యక్షురాలు చలసాని భారతి అవ్వ 11వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవ్వా కిమ్స్ హాస్పిటల్ అలాగే గ్రేస్ ఫౌండేషన్‌తో కలిసి ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సృష్టికి మూలం స్త్రీ అని మహిళా భాగస్వామ్యం లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఒక అమ్మగా.. తల్లిగా..చెల్లిగా.. అక్కగా ఎలాంటి బాధ్యత లను పోషిస్తున్నాము వివరించారు. మహిళలు అబలలు కాదు.. సభలలు..అని ఝాన్సీ లక్ష్మీబాయి,మదర్ తెరిసా, సావిత్రిబాయి పూలే..ఇలాంటి మహోన్నతమైన మహిళా మూర్తులు జన్మించిన దేశం మనది అని సమాజ హితం కోసం పోరాడిన వీరవనితలను ఆదర్శంగా తీసుకుని సమాజం కోసం ప్రతి మహిళ కృషి చేయాలని కొనియాడారు. జననాలను..




గమనాలను శాసించగల ఒక నిశ్శబ్ద విప్లమే మహిళ.. తరతరాల అంతరాల దొంతరలు తొలగిస్తూ అన్ని రంగాలలో పురుషులకు దీటుగా మహిళలు స్వశక్తితో ఎదుగుతూ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలుస్తుండడం ఎంతో గర్వకారణం, హర్షించ దగ్గర విషయం అని ప్రశంసించారు. మహిళలకు ఇలాంటి వేడుకలు నిర్వహించుకోవడానికి,స్వచ్ఛంద సంస్థల తరపున ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవడానికి నియోజకవర్గ పరిధిలో మహిళా భవనాన్ని ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.సమాజ సేవలో తానెప్పుడూ ముందుంటాననీ ప్రతి మహిళ ఆదర్శ మహిళగా ఎదగడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వినోదం, ఆటపాటలతో పాటు గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చలసాని భారతితో పాటు గూడూరు శ్రీలత (జనరల్ సెక్రటరీ), పద్మకాంతి (జాయింట్ సెక్రటరీ), ఈసి సభ్యులు సుజాత,నాగలక్ష్మి, ఫణి నియోజకవర్గ పరిధిలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.

### మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి.. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, మహిళా ఉద్యోగులకు సన్మానం..

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకలకు శ్రీనివాస్ రెడ్డి.. శ్వేత దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు అదేవిదంగా గ్రామంలో ప్రభుత్వ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతూ మహిళా దినోత్సవం అనేది కేవలం ఒకరోజు జరుపుకునే వేడుక మాత్రమే కాకుండా మహిళలను ప్రతి రోజు గౌరవించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సృష్టికి మూలం స్త్రీ అని,మహిళల భాగస్వామ్యం లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అలాగే త్వరలో జరగనున్న పదవ తరగతి బోర్డు పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు, విద్యార్థినులకు తమ శుభాకాంక్షలు తెలియజేసి వారు మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి , ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రభావతి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఆర్ఐటి కాలేజీ లో 300 మంది విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం..




**ప్రజావినికిడి,(దుండిగల్):**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక తెలంగాణ ప్రభుత్వం ఫ్లాగ్షిప్ ప్రోగ్రాం లో భాగంగా సిపి సైబరాబాద్ ఆదేశాల మేరకు సోమవారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఎంఎల్ఆర్ఐటీ కాలేజ్ లో ఎస్హెచ్ఓ దుండిగల్ అధ్యక్షతన 300 మంది విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ కు బానిస కావడం వలన కలిగే నష్టాలను గురిశీచి అవగాహన కల్పించారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని దానివల్ల కలిగి అనర్థాలను ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ అనేది విద్యార్థుల భవిష్యత్తుకు చెరగని మచ్చ అలాంటి ఊబిలోకి దిగకుండా కళాశాల యాజమాన్యాలు కూడా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటి కాలేజ్ యాజమాన్యం కూడా ఆసక్తి కనబరిచి యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని సైబర్ క్రైమ్ విషయంలో పోలీస్ వ్యవస్థకు నుండి ఇంటెన్షిప్ ఇస్తే బాగుంటుంది తెలిపారు.

# కేంద్ర రైల్వే శాఖా మంత్రికి లేఖ

**ప్రజావినికిడి, (అంబర్ పేట్):**




కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ కు విభాగీయ రైల్వే వినియోగదారుల సలహా కమిటి సభ్యుడు కాలపురెడ్డి సాయిబాబా లేఖను రాశారు. లేఖలో రైల్వే టికెట్ నిర్ధారణ (కన్ఫర్మేషన్) విషయంలో గర్భిణీ స్త్రీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక కోటా కల్పించాలన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు, ఉద్యోగుల కార్డు ఉన్న వారి కోసం ప్రీమియం తత్కాల్ అని ప్రత్యేక కోటా ఏర్పాటు చేయడం జరిగింది.కాని గర్భిణీ స్త్రీలు రిజర్వేషన్ టికెట్ నిర్ధారణ (కన్ఫర్మేషన్) కాకపోవడం వల్ల జనరల్ బోగిలలో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కావున రైల్వే టికెట్ బుక్ చేసినప్పుడు వారి మెడికల్ సర్టిఫికేట్ ను గమనించి వారికి కుడా ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆహార నాణ్యతపై దృష్టి సారించాలి. జనరల్ కంపార్ట్‌మెంట్‌లలో రద్దీగా ఉండడం వల్ల రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లలో ప్రయాణించడం సమస్యగా మారుతుంది. ఆర్పీఎఫ్ భద్రతను పెంచాలని కోరారు.

# సమాన పనికి వేతనం అమలు చేయాలి

**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య, శ్రామిక మహిళా ఫోరం హైదరాబాద్ జిల్లా కమిటీలు సంయుక్తంగా సభ నిర్వహించారు. సమాజంలో నాటి మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని, ఆర్థిక, సామాజిక అసమానతలు నివారణకు తగు విధానాలు రూపొందించి అమలు చేయాలని,శ్రమ శక్తిలో అధిక భాగస్వాములుగా వున్న మహిళలు వేతన వివక్షతను తొలగిస్తూ సమాన పనికి సమాన వేతనం అమలు చేసి మహిళలకు గౌరవప్రదమైన హోదా కల్పించే దిశగా ప్రణాళికలను రూపొందించాలని సభలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య శ్రామిక మహిళా ఫోరం నాయకులను తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు హసీనా బేగం, లక్ష్మీబాయి, పార్వతి,స్వరూప, లక్ష్మిలను శాలువాలతో సన్మానించారు. ఈ మధ్యనే జరిగిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీబాయి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా హసీనాబేగంలు ఎన్నికైన సందర్భంగా యూనియన్ నాయకులు, శ్రామిక మహిళా ఫోరం,మహిళా సమాఖ్య నాయకత్వం శాలువాలతో కప్పి, మెమోంటోలతో సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రేంపావని, ఛాయాదేవి,కరుణ కుమారి,పడాల నళిని,సక్రిబాయి, ఫైమీద, ఇ.టి.మంజూష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే నా బాధ్యత

### :శ్రీశ్రీశ్రీ నిత్యానంద సరస్వతి బాబా

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ధ్యానంతోమానసిక,శారీరక సమస్యలు దూరం ఈరోజుల్లో చాలామంది ప్రజలు అనేక రకాలైన వ్యాధుల బారిన పడుతున్నారు. షుగర్ వ్యాధి,బిపి, థైరాయిడ్ లాంటివి సర్వసాధారణం అయిపోయాయి. ఎన్నో రకాల మెడిసిన్స్ వాడుతున్నారు. ఈ మెడిసిన్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తో మరో కొత్త వ్యాధిని కొనితెచ్చుకుంటున్నారు. దత్తాత్రేయ స్వామి ఉపాసకులు శ్రీశ్రీశ్రీ దత్తావధూత కాలేజీ స్వామి శిష్యుడు అయినటువంటి మా గురువు శ్రీశ్రీశ్రీ నిత్యానంద సరస్వతి బాబా మహరాజు ఈ ఆరోగ్య సమస్యలకు ఎటువంటి మెడిసిన్ వాడకుండా వ్యాధిని పూర్తిగా నయం చేసుకునే మార్గాన్ని మీకు చూపించబోతున్నారు. ఎంతోమంది ప్రజల



మానసిక, శారీరక సమస్యలను దూరం చేసి మన ముందుకు ఎన్నో వ్యాధులకు పరిష్కారంగా వచ్చారు. ఆయన సలహాలు సూచనలు తూచా తప్పకుండా పాటిస్తూ, 41 రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పొందగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఆ మహాభాగ్యాన్ని మీరందరూ పొందాలని, ప్రపంచమంతా ఆరోగ్యవంతులుగా మార్చాలని ఆ సంకల్పానికి మీ సహకారం అందించాలని కోరుకుంటున్నాముమీకు ఎటువంటి వ్యాధులు ఉన్న వాటికి పరిష్కారాన్ని చూపగలము. మీరందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు అవ్వాలని ఆశీర్వదిస్తున్నాము ఆ దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై కలుగుగాక. సర్వే జన సుఖినోభవంతు సమస్త లోకానాం సన్మంగళంభవంతుశ్రీ శ్రీ శ్రీ నిత్యానంద సరస్వతి బాబా మహారాజ్(7989099548)

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం




**ప్రజావినికిడి, (వాజేడు):మార్చి 9,**
ఈనెల 6 నుంచి 15 వరకు పది రోజులు పాటు అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్టు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు,పరిశుభ్రత, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నది. ఈ సందర్భంగా అయ్యవారిపేట గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ బెనిని,ఉప సర్పంచ్ సర్వేశ్వరరావు, కార్యదర్శి శ్రీకాంత్, పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ సిబ్బందితో కలిసి పలు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కమ్మదనంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం..

**రిబ్బన్ కట్ చేసి స్వయంగా ఆడపడుచును ఆహ్వానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**దంపతులిద్దరికీ నూతన వస్త్రాలు.. - సొంతింటి వేడుకలా గృహప్రవేశం జరిపిన ఎమ్మెల్యే..**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
రావమ్మా.. మహాలక్ష్మి.. రావమ్మా..అంటూ సొంత ఆడపడుచును ఇంట్లోకి ఆహ్వానించినట్లు లబ్ధిదారును ఆహ్వానించాడు.. ఈ కోవెల నీ ఇల్లు.. కొలువై ఉందువు గాని..అంటూ గృహప్రవేశం చేయించాడు.. ఫరూక్ నగర్ మండలం కమ్మదనం గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్న లబ్ధిదారు పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చూపించిన ఆదరణ ఇది.. సొంత చెల్లెలి ఇంటి వేడుకలా గృహప్రవేశం చేయించి దంపతులిద్దరికీ నూతన వస్త్రాలను అందించి వారి గుండెల నిండా ఆనందాన్ని నింపాడు. స్వయంగా రిబ్బన్ కట్ చేసి ఇంటిలోకి ఆహ్వానించడం విశేషం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సొంతింటి కల ప్రతి ఒక్కరికి ఉంటుందని, నిరుపేదలకు ఆ కలను తీర్చే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని వెల్లడించారు. భవిష్యత్తులను అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని వెల్లడించారు. అదేవిధంగా పట్టణ ప్రాంతంలో కూడా వార్డుల వారిగా ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడకల ఇండ్లు అందిస్తామని స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోశాధికారి దేవగిరి నవీన్ , పురుషోత్తం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోవు అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్,సర్పంచ్ గోధుల లత కిరణ్ కుమార్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్,కాంగ్రెస్ నాయకులు ఇప్పలపల్లి కిష్టయ్య, కారుకొండ చెన్నయ్య, కొమురయ్య లక్ష్మయ్య, యాదయ్య, అబ్దుల్,శీను,రవి, రాఘవేందర్, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింలు,తాండ రవీందర్ రెడ్డి, రాజేందర్,శ్రీనివాస్ రెడ్డి,యాదగిరి గౌడ్,దేవగిరి రాజు, రామచంద్రయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# టేకులగూడెం వాలీబాల్ టోర్నమెంట్ విజేత ముళ్లకట్ట జట్టు



**ప్రజావినికిడి,(వాజేడు):మర్చి 9,** టేకులగూడెం గ్రామం లో సువిద వికాస్ ట్రస్ట్ అష్ణగుర్తి వారి ఆర్థిక సహకారం తో భీష్మ శంకర యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ 6,7,8 తేదీలో నిర్వహించడం జరిగింది.ఈ టోర్నమెంట్ కి వివిధ మండలాల నుండి 50 టీమ్ లు పాల్గొన్నాయి.అందులో ముళ్లకట్ట టీం మొదటి బహుమతి 20,016/- మేడల్స్,అలాగే కప్ అందుకున్నారు, రెండవ బహుమతి ఏటూరునాగారం టీం 10,016 /- మేడల్స్,అదేవిదంగా కప్ అందుకోవడం జరిగింది.ఈ సందర్భంగా సువిద ట్రస్ట్ ఆపగుర్తి ఫౌండర్ మన్మధరావు మాట్లాడుతూ, నేను ఈ గ్రామం లో టీచర్ గా పని చేసానని నా ఓల్డ్ స్టూడెట్స్ ఉన్నారని అయన అన్నారు.నా గుర్తుగా ఏదైనా చేసి ఇక్కడ గేమ్స్ ఏర్పాటు చేయాలనీ నిర్ణయించుకొని ఈ విదంగా వాలీబాల్ టోర్నీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అలాగే క్రీడాకారులను ఉద్దేశించి ప్రతి క్రీడా కారులు గమనించాలి అని మ్యాచ్ గెలిసిన ఒడిన సహజంగానే ఉంటుంది పంతాలకు పోయి గొడవలు పడవద్దని అన్నారు.ఈ మూడు రోజులు క్రీడాకారులు వారి యొక్క అటను ప్రధర్శించారు చాలా చక్కగా ఆడారని. అలాగే గ్రామం లోని యూత్ అలాగే మేనేజ్ మెంట్ వారు అందరూ సహకరించారనీ వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.గేమ్స్ అడించడానికి పిఈటి లు ఉయిక నవీన్,పూనెం నవీన్,వాసం సునీల్,పూనెం లావణ్య,ఎంతో క్రమంగా ఆటలు ఆడించారాని అభిందించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ చిడెం బాలకృష్ణ,మాజీ సర్పంచ్ ఆనందరావు,గ్రామ పెద్దలు కుర్సం దక్షణమూర్తి,టోర్నమెంట్ మేనేజ్ మెంట్ వాసం పవన్, కుర్సం దామోదర్,వాసం దిలీప్,పూనెం సందీప్,కుర్సం శ్రీకాంత్, భోజనాలు తయారు చేసిన టీం కుర్సం సత్యం, జెజ్జరీ,రాము, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ,తరగతి విద్యార్థులకు డిజిటల్ ప్యానెల్ స్క్రీన్ పాఠాలు



**ప్రజావినికిడి,(వాజేడు):**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారంలో 2025-26 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని డిజిటల్ ప్యానెల్ స్క్రీన్ ద్వారా వీక్షింపజేయడం జరిగింది.ఈ నెల 14 వ తేది నుండి జరుగనున్న పదవతరగతి విద్యార్థులు పరీక్షలను సమర్థ వంతంగా వ్రాయుటకు ఎక్కువ మార్కులు సాధించుటకు అనుసరించదగిన పద్ధతులు పాటించవలసిన విధానాలను సోదాహరణంగా వివరించడం జరిగింది.పాఠశాల విద్యాశాఖ సెక్రటరీ శ్రీమతి డాక్టర్ యోగిత రాణ పదవ తరగతి విద్యార్థులతో టీ-శాట్,ద్వారా ముఖాముఖి అవుతున్న కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారం విద్యార్థులతో కలిసి వీక్షిస్తున్న మండల విద్యాశాఖ అధికారి టి వెంకటేశ్వరరావు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యోగితా రాణా మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా, నిద్రలేమికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటూ పరీక్షలు రాయాలని,సబ్జెక్టులకు సంబంధించిన విషయాలపై భయాందోళనలకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి అధిక మార్కులు సాధించాలని రాష్ట్ర అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు చల్లగురుగుల మల్లయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బొగ్గం కుమార్ బాబు ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమిత్రలకు క్యాడర్ మంజూరు

## నిర్ణయానికి కృతజ్ఞత సభ



**ప్రజావినికిడి,(హైదరాబాద్):మార్చి 9,**రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రాలకు క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిన సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో భవిష్యత్తులో ఆరోగ్యమిత్రలందరినీ ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ నాయకులు కోరారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్న ఆరోగ్యమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలు గత కొన్నేళ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా వారందరినీ ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి జయలక్ష్మి సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై మహిళలు ధైర్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాగుతున్న పోరాట ఫలితంగా క్యాడర్ మంజూరు చేయడంపై మంత్రి దామోదర రాజనర్సింహకు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ పి ఉదయ్ కుమార్ ఐఏఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం కుమార్, ఉపాధ్యక్షుడు సుమన్,రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్,రవీందర్, హైదరాబాద్ అధ్యక్షుడు రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రత్నం, నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు యూసఫ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్,జనరల్ సెక్రెటరీ నగేష్, ఈశ్వరి బాయ్, స్వప్నతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ మెగా హెల్త్ క్యాంపు ను

# ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ ప్రభుత్వము 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాంలో భాగంగా సోమవారం రోజు షాద్ నగర్ డివిజన్ లోని కేశంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా స్పెషలిస్ట్ వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, కేశంపేట గ్రామ సర్పంచ్ శాంత చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెగా వైద్య శిబిరంలో 6 మంది డాక్టర్లు,1).డాక్టర్ అమృత మహిళలకు సంబంధించిన స్పెషలిస్ట్, 2). డాక్టర్ ఆఫ్ రింగ్ కాన్ చిన్నపిల్లల స్పెషలిస్ట్, 3).డాక్టర్ ఉమామహేశ్వరి కంటి వైద్య నిపుణులు, 4).డాక్టర్ సుష్మ శ్రీ ఎముకల సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులు, 5).డాక్టర్ ప్రతిభా దంత వైద్య నిపుణులు, 6).డాక్టర్ వీరప్రసాద్ జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు.వీరు రందరూ హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషలిస్టులు మన గ్రామంలో ఉన్న అందరికీ 60 రకాల పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. గర్భవతులకు, చిన్నపిల్లలకు,దంత సమస్యలకు,కంటి చూపుకు,జనరల్ గా సంబంధించిన వ్యాధులకు, మరియు మోకాళ్ల నొప్పులు కీళ్ల నొప్పులకు సంబంధించిన బీపీ షుగర్లకు సంబంధించిన వ్యాధుల గురించి ఇక్కడ ప్రత్యేకంగా చికిత్స చేసి ఫ్రీగా మందులు అందజేస్తారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మెగా స్పెషలిస్ట్ వైద్యుల క్యాంపును కేశంపేట మండలంలోని అందరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ తెలియచేశారు. ఇవే పరీక్షలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయిస్తే ఒక్కొక్కరికి 4,000 నుండి 5000 రూపాయలు ఖర్చు అవుతుందని, అలాంటిది మన పేదల ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు ఉచితంగా,క్యాంప్ పెట్టి అన్ని ఫ్రీగా చేయిస్తుందని ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు,మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల రెడ్డి,ప్రజా నాయకులు,షాద్ నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, కేశంపేట వైద్యాధికారి డాక్టర్ నికిత,హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు,ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారులు,ఎం పి హెచ్ ఈ ఓ లు శ్రీనివాస్, శివానంద్,హెల్త్ సూపర్వైజర్లు, స్టాఫ్ నర్సులు,మహిళ ఆరోగ్య కార్యకర్తలు,రవికుమార్,సీనియర్ అసిస్టెంట్,ఎల్ డి కంప్యూటర్ ఆశాలు మొదలుకు వారు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
వంద పడకల ఆసుపత్రిని అత్యధిక సదుపాయాలతో, పూర్తిస్థాయి వసతులతో నిర్మాణం చేపట్టబోతున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. లింగారెడ్డిగూడెం గ్రామశివారులోని అలీసాబ్ గూడ వద్ద నిర్మిస్తున్న నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల కల్పన కోసం అదనంగా రూ.5.31 కోట్లు ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎమ్మెల్యే శంకర్, స్థానిక సర్పంచ్ ఎం సి రాజు,ఉప సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తన చేతులో మీదుగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, మంజూరైన నిధుల ద్వారా ఆసుపత్రిలో ప్రహరీ నిర్మాణం,సీసీ రోడ్ల ఏర్పాటు,మెడికల్ ల్యాండ్రీ,మోడ్రన్ కిచెన్ షెడ్, పార్కింగ్ షెడ్, మార్చురీ భవనం, బయో వేస్టేజ్ నిర్వహణ లను చేపడుతామని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి అత్యాధునిక వైద్యం ఇక్కడ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి చేసి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారుప్రభుత్వ ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి,లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామస్తులు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్ గౌడ్,వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్,వీరేష్ గౌడ్,నరేందర్ రెడ్డి, మంగలి రమేష్, అరుణ్ కుమార్, మహమ్మద్,గంటల శంకరయ్య,పక్కనే నరేష్,గోద జంగయ్య, ఖదీర్,విగ్నేష్, బాలరాజు గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్ఐసి ఏజెంట్స్ నరేష్,నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో జీవిత భీమా సంస్థ ఎల్ ఐ సి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్ ఐ సి ఏజెంట్లు నరేష్,నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గల మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. మహిళలకు భద్రత, ఎంపవర్‌మెంట్‌పై చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లు నరేష్,నవీన్ కుమార్ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక భద్రత కోసం ఎల్ఐసి ప్రత్యేక పాలసీలు, పథకాలను తీసుకువచ్చిందని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా భారతీయ జీవిత భీమా సంస్థ విద్యార్థులకు స్కాలర్షిప్ వంటి ఎన్నో వినూత్నమైన సేవలు చేస్తుందని అన్నారు. అంతేకాకుండా మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,

వారి అభివృద్ధికి ఎల్ఐసి కట్టుబడి ఉందని తెలిపారు. మహిళా దినోత్సవం రోజుననే కాకుండా ప్రతిరోజు మహిళలు గౌరవించబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి శ్వేతా,ఏఎన్ ఎమ్ గౌసియా బేగం,ఆశ కార్యకర్తలు యాదమ్మ,జ్యోతి,సరోజ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పట్నాల సావిత్రికి అంతర్జాతీయ పురస్కారం

## మహిళా దినోత్సవం సందర్భంగా ఘన సత్కారం

**ప్రజావినికిడి,(హైదరాబాద్): మార్చి 9,**




కూకట్ పల్లి లోని పికాసా స్టూడియో లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో (సామాజిక,ఆర్థిక, రాజకీయ,క్రీడలు) విశేష కృషి చేసిన మహిళలను అభినందిస్తూ, వారి విజయాలను గౌరవిస్తూ విశేష పురస్కారాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సమాజ సేవకురాలు డాక్టర్ పట్నాల సావిత్రి సేవను గుర్తించి (ఉమెన్ ఆఫ్ ఇన్ఫ్లుయెన్స్ నేషనల్ అవార్డ్) అంతర్జాతీయ ప్రభావిత మహిళా పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ కడపగండ్ల చక్రవర్తి అదేవిదంగా సావిత్రి పట్నాల మాట్లాడుతూ, మహిళల హక్కుల ఉద్యమాన్ని, సాధికారతను, సమానత్వాన్ని స్మరించు కుంటూ సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలకు వారిని గౌరవిస్తూ ఈ మహిళా దినోత్సవ మహోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలందరూ కలిసికట్టుగా ఐక్యమత్యంగా ఒకే మాటగా ఒకే బాటగా ఉండి ఇంకా ఎన్నో రంగాలలో విజయస్తులుగా నిలవాలని వారు తెలియజేయడం జరిగింది. ఈ సమాజంలో స్త్రీల పాత్రను,వారి హక్కులను గౌరవించే వేడుకలకు ఈ అవార్డులు ఒక ప్రతీకగా నిలుస్తాయి అన్నారు. మహిళా సాధికారత కోసం పనిచేసే మనం ఫౌండేషన్,ప్రతి స్త్రీ సామాజికంగా అలాగే ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటుంది. అమ్మ మాటలు తెలియని పెదవుల అమృతం. ఈ జననం ఆమె చల్లని ఒడిలో ప్రారంభమైంది. స్త్రీగా మీ త్యాగం ఎప్పటికీ మరువబడదు సృష్టి ఉన్నంతకాలం ఉంటుంది అన్నారు. ఈ సందర్భంగా మహిళా మణులందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

# ఎల్బీనగర్ లో సత్య అక్వేరియం పెట్స్ ప్రారంభం



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): మార్చి9,**

ఎల్బీనగర్ రింగ్ రోడ్‌లోని పోలీస్ స్టేషన్ ఎదురుగా సత్య అక్వేరియం పెట్స్ దుకాణాన్ని సురేష్ ముదిరాజ్ నేతృత్వంలో ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తమ దుకాణంలో అన్ని రకాల చేపలు,వివిధ రకాల అక్వేరియంలు, పెంపుడు జంతువులు , చేపల కోసం అవసరమైన వస్తువులు,ఫుడ్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా అక్వేరియంలు తయారు చేసి అందిస్తామని చెప్పారు. రెస్టారెంట్‌లు, హోటల్‌లు, కార్యాలయాలు, ఇళ్లలో ఏర్పాటు చేసుకునేందుకు కావాల్సిన అక్వేరియంలను కూడా తయారు చేసి అందిస్తామని వెల్లడించారు. అక్వేరియంల నిర్వహణపై ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదిస్తే మార్గదర్శనం అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సురేష్ ముదిరాజ్‌ను 9985890041 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఆరోగ్య అవగాహన సదస్సు

## పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షా సామాగ్రి, శానిటేషన్ కిట్స్ పంపిణి





**ప్రజావినికిడి,(హైదరాబాద్):**

శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ విజన్ 1 లో భాగంగా సోమవారం నగర శివారులోని లక్ష్మక్కపల్లి లోని విపిజే ఫంక్షన్ హాల్ లో మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థినిలకు ఆర్విఎం హాస్పిటల్ అనుభవజ్ఞులైన స్త్రీ వైద్య నిపుణులచే ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థినులకు పరీక్షా సామాగ్రిని, శానిటేషన్ కిట్స్ ను అందించడం జరిగింది. మండలంలోని సుమారు 800 మంది విద్యార్థినులకు శానిటేషన్ కిట్లను అందిస్తున్నామని శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణు జగతి తెలిపారు. శ్రేయోభిలాషి సేవ ట్రస్ట్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు ముఖ్యంగా విద్య వైద్యములపై దృష్టి పెడుతూ పేదలకు తగిన సామాజిక సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను ఉపాధ్యాయులను శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ప్రతినిధులు కోశాధికారి గంప ఆంజనేయులు, జాయింట్ సెక్రెటరీ మొగిలి రాజశేఖర్ రెడ్డి, మీడియా ప్రతినిధి బచ్చు చంద్రశేఖర్, సభ్యులు కోలా భాస్కర్,ఆర్విఎం హాస్పిటల్ వైద్యురాళ్ళు డాక్టర్ పోషాల ప్రజ్ఞ, డాక్టర్ ఎస్ తేజస్వి, డాక్టర్ దీప్షిక, ఎంఈఓ ఉదయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు బి రవికుమార్ హెచ్ ఎం క్షీరసాగర్,ఎం కవితాదేవి,హెచ్ ఎం ఆర్ అండ్ కాలని,డి నాగరాణి,వీణ, శోభారాణి,రజిని కుమారి,ఆర్విఎం మార్కెటింగ్ సిబ్బంది గౌరవ డాక్టరేట్ మంచినీళ్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ..

## ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**



పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ నేతృత్వంలో నిర్వహించనున్న "ప్రధాన్ మంత్రి సంసద్ ఖేలో" క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణతో పాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం షాద్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలతో ప్రారంభమైన "సంసద్ ఖేలో" కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ,జట్టు భావన పెంపొందించి బలమైన భారత దేశ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలలో కబడ్డీ,క్రికెట్, వాలీబాల్,ఖోఖో వంటి క్రీడలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువకులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మార్చి 9 నుండి 24వ తేదీ వరకు జట్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, అలాగే ఏప్రిల్ 9 నుండి 24వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. కాబట్టి యువకులు క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆన్‌లైన్ ద్వారా జట్లు నమోదు చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేపల్లి అశోక్ గౌడ్, మల్చలం మురళి, ఇస్నాతి శ్రీనివాస్, శ్రీనివాస్ చారి,మోహన్ సింగ్,లక్ష్మీకాంత్ రెడ్డి,షాద్ నగర్ 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్,లష్కర్ నాయక్,మహేందర్ రెడ్డి,రాజు,వడ్ల అరవింద్,మఠం ఋషి కేష్,సుధాకర్ అప్పా,క్యామ మహేష్,రాజేశ్వరి,సందీప్ యాదవ్,వినోద్ నాయక్,మహేష్,రఘు గౌడ్,రామకృష్ణ యాదవ్,అనిల్ గౌడ్,ప్రశాంత్ గౌడ్,గజ్జల ప్రవీణ్,బల్ రెడ్డి,భాస్కర్ పటేల్,కొత్త సతీష్, చందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ మున్సిపల్ కమ్యూనిటి హాల్ ను, బస్తి దవాఖాను సందర్శించిన కలెక్టర్ సి. నారాయణరెడ్డి

**ప్రజావినికిడి, (శంషాబాద్):**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ పైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని శంషాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శంషాబాద్ లోని మున్సిపల్ కమ్యూనిటి హాల్ ను,బస్తి దవాఖాను సందర్శించి ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. బస్తీ దవాఖానకు వచ్చే వారికి అందిస్తున్న వైద్యం వివరాలు, మందుల వివరాలు డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానలో చేస్తున్న రక్త పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు,మందుల గురించి దవాఖానకు వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వివరాలు రిజిస్టర్ నందు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రతగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్





మాట్లాడుతూ, జూన్ 12వ తేదీ వరకు ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్లను పూర్తిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని,ప్రతి కార్యాలయంలో అవసరమైన చోట ఏమైనా మరమ్మత్తులు,పెయింటింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని,ఎక్కడ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. రోజు వారీగా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలని, నీటి నిల్వలు లేకుండా,దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ చంద్రకళ, రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితా దేవి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఉత్సాహంగా '5కే రన్'..

## ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## హాజరైన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, అధికారులు

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 ప్రణాళిక కార్యాచరణలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 5కే రన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై,జెండా ఊపి పరుగును ప్రారంభించారు. పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ 5కే రన్, షాద్‌నగర్ ముఖ్య కూడలి వరకు సాగింది. ఆరోగ్య అవగాహన, ప్రభుత్వ లక్ష్యాల సాధన ధ్యేయంగా సాగిన ఈ పరుగులో విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మార్గమధ్యలో యువత ఉత్సాహంగా నినాదాలు చేస్తూ పరుగును కొనసాగించారు. ఈ సందర్భంగా







ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికల్లో ప్రజలను, ముఖ్యంగా యువతను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను,భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు,ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరం



**వేములపల్లి ,మార్చి9ప్రజావినికిడి:**
వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామంలో ఈ ఉదయం 10 గంటలనుండి 12 గంటలవరకు గ్రామపంచాయతీ కార్యాలయం నందు నార్కెట్ పల్లి కామినేని ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమం ఎంతో మంది ప్రజలకు ఉపయోగపడుతుంది ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న అనారోగ్యం గా ఉన్న ట్రీట్మెంట్ అందించి వారికి కావలసిన మెడిసిన్ ఇవ్వడం జరిగింది అలాగే ఈ కార్యక్రమం లో మొల్కపట్నం కార్యదర్శి స్వాతి గ్రామ సర్పంచ్ మౌనిక సురేందర్  పాల్గొనడం జరిగింది గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య సేవలను గ్రామ ప్రజలు అందరూ కూడా ఉపయోగించుకోవడం జరిగింది నిరుపేద కుటుంబాలకు ఇది మంచి అవకాశం అని మందులకు చెకప్ కి, రూపాయి ఖర్చు లేకుండా ఇబ్బందులు లేకుండా అందరికీ ఈ వైద్యం అందేలా నిర్వహించడం జరిగింది.

# లిక్కర్ కన్నా సారాయే బెటర్

### గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి

### జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి9ప్రజావినికిడి::** జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి  సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బాంబు పేలుస్తానని అన్నారు. సచివాలయం ఎదుట మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సారా దుకాణాలు ఓపెన్ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరుతానని అన్నారు.  గతంలో సారా తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. సారా తాగి 115 సంవత్సరాల పాటు బ్రతికిన జనం, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతు న్నారని పేర్కొన్నారు.సైంటిఫిక్ గా సారా ఆరోగ్యానికి హానికరం కాదని,ఇటీవల కొన్ని రాష్టాలు సారా దుకాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు.మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్టాల్రలో ప్రభుత్వాలు అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నారని వివరించారు. వచ్చే బ్జడెట్ అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తాననని స్పష్టం చేశారు.

## యువత ఆధునిక నైపుణ్యాలు పెంచుకోవాలి: కలెక్టర్

**హనుమకొండ,మార్చి9ప్రజావినికిడి**: మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతలో ఆధునిక నైపుణ్యాలు పెంపొందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు.సోమవారం ములుగురోడ్డులోని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించే ఆరు అధునాతన కోర్సుల ఉచిత శిక్షణ కార్యక్రమాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. డిగ్రీలు ఉంటే సరిపోదని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు ఉంటేనే ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలబడగలరన్నారు. ఐటీఐలలో నూతనంగా తీసుకువచ్చిన అధునాతన కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ మంగునూరి చందర్ మాట్లాడుతూ అధునాతన కోర్సులలో ఉచిత శిక్షణ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు ములుగురోడ్‌లో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో నేరుగా సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ ఐటీఐ ప్రిన్సిపల్ సక్రు, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, కార్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణికి (99) ఫిర్యాదులు..







**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**
ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి  అధికారులను ఆదేశించారు.  సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులుఅందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి  స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ 19,ఇతర శాఖలకు 80,మొత్తం 99 దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతున్నాం

**ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేసిందన్న సీఎం**

**రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కొత్త పాస్‌పుస్తకాలు**

**కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి**

**గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ**



**నంద్యాల,,మార్చి9ప్రజావినికిడి:**
శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు హెచ్చరించారు. లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు.

రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు. గత ఐదేళ్ల దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్కొన్నారు. కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

**ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన**

**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం**

**కవితను అరెస్ట్ చేసిన పోలీసులు**



ఖమ్మం,,**మార్చి9ప్రజావినికిడి:**ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# ఇండస్ట్రీల్రకు అనుగుణంగా  నైపుణ్యాలు

### 99 రోజుల ప్రణాళికలో ఐటీఐలో ఆధునిక కోర్సులు

### కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్,,**మార్చి9ప్రజావినికిడి:**
 తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన  ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ లో నూతన స్వల్పకాలిక కోర్సులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీ,  ప్రొడక్ట్ డిజైనింగ్ వంటి ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఏటీసీ మరియు ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.  సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత అందుబాటులో లేరని అనేక పరిశ్రమలు చెబుతున్నాయని, అందుకే ఇండస్ట్రీల్రకు అవసరమైన స్కిల్ సెట్స్ని విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏటీసీలు, ఐటీఐలు భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ పొందిన నిపుణులను తయారు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ÷లిటి ప్రపంచంలో ఒక్క నైపుణ్యం సరిపోదని, యువత మల్టీ స్కిల్డ్  ఉంటేనే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఏటీసీల నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణా విధానం ఉండాలని ప్రిన్సిపాల్స్‌కు సూచిస్తున్నామని చెప్పారు. ÷–రామీణ ప్రాంతాల్లో టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో మన ఉత్పాదకత తక్కువగా ఉన్నందున అగ్రి అలైడ్ సెక్టార్‌లో నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం !

**,మార్చి9ప్రజావినికిడి:**
చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది.చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా



ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

## చమురు ధరలతో మార్కెట్ల కుదేలు

### రూపాయి విలువ పడడంతె దేశీయ మార్కెట్లపై ప్రభావం

**న్యూఢిల్లీ,,మార్చి9ప్రజావినికిడి:**పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర వంద డాలర్లు దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిలో ఉండడం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి భారీగా పతనమవడం దేశీయ సూచీలపై నెగిటివ్ ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (78,918)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 2000 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పతనమైంది. మరో ఆరు వందల పాయింట్లు కిందకు వెళ్లింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 70,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2037 పాయింట్ల నష్టంతో 76,881 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. 2.5 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 624 పాయింట్ల నష్టంతో 23,826 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎమ్‌సీఎక్స్ ఇండియా, కోల్ ఇండియా మొదలైన షేర్లు మాత్రమే స్వల్ప లాభాల్లో ఉన్నాయి . ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనో మిండా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, హిందుస్థాన్ పెట్రో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1587 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2280 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.32గా ఉంది.

## ఆర్థిక అనిశ్చితితో తగ్గుతున్న పసిడిధరలు

### బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల

**న్యూఢిల్లీ,,మార్చి9ప్రజావినికిడి:**
గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

--------

## తిరుపతి జిల్లాలో విషాద ఘటన

### కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి



**తిరుపతి,మార్చి9ప్రజావినికిడి:** జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

## వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

### ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

**హైదాబాద్,,మార్చి9ప్రజావినికిడి:**
తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో
ఉపయోగించే 2 బ్రోమో-4 మెథైల్ ప్రొపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో-1 ఫెనైల్-1 ప్రొపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.
ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ




రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷-దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

**కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు**

**దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది**

**సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం**

**కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

**పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్**

**న్యూఢిల్లీ,,మార్చి9ప్రజావినికిడి:**
భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్



పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "2025 డిసెంబరులో కేవలం రెండు రోజుల్లోనే మోదీ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఎంజీనరేగా రద్దును బుల్డోజ్ చేసింది. రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు జరపలేదు. సంబంధిత స్టాండింగ్ కమిటీ ద్వారా ఎటువంటి పరిశీలన జరగలేదు. 2026 ఏప్రిల్ 1నుంచి కొత్త చట్టం అమలు కానుంది. దీని అమలుకు ముందుగా జరగాల్సిన సంప్రదింపులు ఇప్పుడు జరుగుతున్నాయి. వివరాలు ఇంకా రూపొందుతున్నాయి" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కాగా, పశ్చిమాసియా ఘర్షణల వేళ రాజ్యసభలో సోమవారం కీలక ప్రకటన చేశారు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్. పశ్చిమాసియాలోని పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్య పరంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

# అమెరికాలో 'ఉస్తాద్' ఫీవర్..

## విడుదలకు ముందే రికార్డు వసూళ్లు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్‌లో తన సత్తా చాటుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 50 వేల డాలర్లకు (భారత కరెన్సీలో సుమారు రూ. 41 లక్షలు) పైగా గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పుంజుకుంటాయని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు విదేశాల్లో ఉన్న బలమైన ఫ్యాన్ బేస్, అలాగే హరీశ్ శంకర్‌తో ఆయన కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా ఉండటంతో ఈ క్రేజ్ ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, నార్త్ అమెరికా మార్కెట్‌లో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇద్దరు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వీరిద్దరి సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పవన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా హరీశ్ శంకర్ ఈ సినిమాను పవర్-ప్యాక్డ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో తీర్చిదిద్దుతున్నారు. 'ఓజీ' వంటి భారీ చిత్రం తర్వాత పవన్ కల్యాణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు పది రోజుల ముందే ఓవర్సీస్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం చూసి, సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనాలు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ నిర్మాత వల్ల నెల రోజులు ఖాళీగా ఉన్నా...



బాలీవుడ్ నటి ఆదా శర్మ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని అభిమానులతో పంచుకున్నారు. డేట్స్ సర్దుబాటు చేసే క్రమంలో ఓ నిర్మాత తన మేనేజర్‌ను బూతులు తిట్టారని, ఆ నిర్మాత తీరు వల్ల తాను నెల రోజుల పాటు ఎలాంటి పని లేకుండా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు.
తాను ఒకే సమయంలో మూడు సినిమాలకు అంగీకరించానని, అయితే మొదటి సినిమా డేట్స్ పదే పదే మారడంతో మిగతా రెండు ప్రాజెక్టుల షెడ్యూల్స్‌కు ఇబ్బంది వచ్చిందని ఆదా తెలిపారు. అయినా సరే మొదటి సినిమా నిర్మాత తనకు ఆ పలానా తేదీలే కావాలని పట్టుబట్టారని, ఈ క్రమంలో తన మేనేజర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా ఇద్దరు దర్శకులు చాలా హుందాగా వ్యవహరించి తమ షూటింగ్ తేదీలను మార్చుకున్నారని ఆదా వివరించారు. మూడో సినిమా నిర్మాత అయితే తనకోసం ఏకంగా ఇతర నటీనటుల డేట్స్ కూడా అడ్జస్ట్ చేశారన్నారు. "ఇండస్ట్రీలో చెడ్డవాళ్లే కాదు, మంచివాళ్లు కూడా ఉన్నారని చెప్పడానికే ఈ విషయం చెబుతున్నా" అని ఆమె అన్నారు. అయితే, అందరూ సర్దుబాటు చేసుకున్నాక, మొదటి సినిమా నిర్మాత మాత్రం తనకు ఇప్పుడు ఆ డేట్స్ వద్దని చెప్పడంతో తాను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నానని ఆదా వాపోయారు. ఇదే సమయంలో 'ది కేరళ స్టోరీ' సీక్వెల్‌లో తాను ఎందుకు నటించడం లేదన్న దానిపై కూడా ఆదా శర్మ స్పందించారు. తాను భాగం కాని సినిమా గురించి వార్తల్లో నిలవడం కోసం మాట్లాడటం సరికాదన్నారు. తనకు సీక్వెల్‌లో అవకాశం వచ్చిందా లేదా అనేది మేకర్స్, తన మధ్య ఉండాల్సిన విషయమని స్పష్టం చేశారు. మొదటి భాగం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐసిస్ క్యాంపుల నేపథ్యంలో సాగితే, రెండో భాగం పూర్తిగా భిన్నమైన కథ అని ఆమె తెలిపారు.

# మైక్ దొరికితే తెలివి పెరగదు..

## పార్థిబన్‌కు త్రిష స్ట్రాంగ్ కౌంటర్!





ప్రముఖ నటుడు ఆర్. పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఘాటుగా స్పందించారు. మైక్రోఫోన్ చేతికి దొరికినంత మాత్రాన మాట్లాడే మాటల్లో తెలివి ఉండదని, అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుందని ఆమె చురకలంటించారు. ఇటీవల ఒక అవార్డుల కార్యక్రమంలో త్రిషను ఉద్దేశించి పార్థిబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపాయి.

### అసలేం జరిగింది?

ఇటీవల జరిగిన గలాటా అవార్డ్స్ కార్యక్రమంలో గతంలో తను కలిసి పనిచేసిన నటీనటులపై అభిప్రాయం చెప్పాలని పార్థిబన్‌ను కోరారు. ఈ క్రమంలో తెరపై త్రిష ఫొటో కనిపించగానే, ఆయన ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి. బయటకు రాకుండా చూసుకోవాలి. అదే మంచిది" అని అన్నారు. ఇటీవల నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి త్రిష ఒక వివాహ వేడుకలో కనిపించిన నేపథ్యంలో పార్థిబన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### ఘాటుగా స్పందించిన త్రిష

ఈ వివాదంపై త్రిష తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా గట్టిగా బదులిచ్చారు. "ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో ఒక వ్యక్తి తన అసిస్టెంట్ ద్వారా చెప్పించి చివరి నిమిషంలో నా పేరు, ఫొటో చేర్చారని ఆర్గనైజర్లు నాకు తెలిపారు" అని ఆమె వెల్లడించారు. "చేతిలో మైక్ ఉన్నంత మాత్రాన మాట్లాడే మాటలు తెలివైనవిగా లేదా హాస్యంగా ఉండవు. అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుంది. అవగాహన లేకుండా మాట్లాడే అసభ్యకరమైన మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో వారి కంటే, మాట్లాడిన వ్యక్తి గురించే ఎక్కువ చెబుతాయి" అని ఆమె పోస్ట్ చేశారు. త్రిష స్పందనకు నెటిజన్ల నుంచి మద్దతు లభించింది.

### క్షమాపణ చెప్పిన పార్థిబన్

తన వ్యాఖ్యలపై వివాదం ముదరడంతో నటుడు పార్థిబన్ దిగివచ్చారు. ఈ నెల 8న తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు. త్రిషను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది. అయితే, సహనటిపై సీనియర్ నటుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఫన్ ర్యాప్ సాంగ్

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్- డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటివల విడుదలైన ఫన్ ఫిల్ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా సినిమాకు సంబంధించిన ఫన్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా సటైరికల్ టోన్‌ను అద్భుతంగా చూపిస్తోంది. ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం2026 వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. 'కశ్యప్ శ్రీనివాస్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అసలైన హీరో ఈ సినిమాకి ఆయన, ఆయన కథ. కష్టపడ్డ సింహం ఆయన. అదృష్టమైన సింహాన్ని నేను. తప్పకుండా ఈ సినిమాని ఫ్రెండ్స్‌తో ఫ్యామిలీతో కలిసి చూడండి' అని అన్నారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాని మా డైరెక్టర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా తీశాడు. సినిమా చాలా బాగా వచ్చింది' అని పేర్కొన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరిని ఎంటర్‌టైన్ చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ అసుర పాల్గొన్నారు.

# విజయ్ సినిమాకు మరో షాక్.. రిలీజ్ మరింత లేటుగా..

రాజకీయాలపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు తమిళ స్టార్ హీరో విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అయితే చివరిగా ఆయన నటించిన చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల కావాల్సింది. కానీ, అనుకోని అడ్డంకులు ఏర్పడి సినిమా విడుదల ఆగిపోయింది. ప్రస్తుతం ఈ సినిమా విడుదల కేసు కోర్టులో ఉంది. ఈ సినిమాను రివైజింగ్ కమిటీ వీక్షించాలి. కానీ, కమిటీలో ఒక సభ్యుడు అనారోగ్యం కారణంగా సినిమా స్క్రీనింగ్ చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో సినిమా రిలీజ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అన్ని సమస్యలు తీరితే సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేద్దామని భావించారు. కానీ, అది జరగలేదు. ఆ తర్వాత ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇంకా రివ్యూ కమిటీ వీక్షించి రిపోర్ట్ ఇస్తే.. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుంది. కానీ, అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. దీంతో ఏప్రిల్‌లో కూడా సినిమా రిలీజ్ అయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు విజయ్ పుట్టిన రోజు నాడు దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613